# సంక్రాంతికి.. బైరామల్‌గూడ లూప్

ఓఆర్ఆర్ తరహాలో నగరంలో రూపుదిద్దుకున్న ప్రాజెక్టు

## ఎస్ఆర్‌డీపీలో అరుదైన నిర్మాణం అందుబాటులోకి



- తుది దశకు చేరుకున్న నిర్మాణ పనులు
- ఎల్బీ నగర్‌లో పూర్తిస్థాయిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం

సిటీబ్యూరో, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ఎస్ఆర్‌డీపీ (వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం) నిర్మాణాల్లో అరుదైన ప్రాజెక్టు అందుబాటులోకి రాబోతున్నది. ఔటర్ రింగు రోడ్డు తరహాలో ఎల్బీ నగర్ నియోజకవర్గంలోని బైరామల్‌గూడలో లూప్ అకారంలో నిర్మాణం జరిగింది. స్థానికంగా ట్రాఫిక్ సుడిగుండాలకు శాశ్వత పరిష్కారంగా, వాహనదారులకు బహు ప్రయోజనాలతో దాదాపు రూ.135 కోట్లతో లూప్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా.. సంక్రాంతి నాటికల్లా అందుబాటులోకి తెచ్చేందుకు ఇంజినీర్లు పనులను వేగిరం చేశారు. ప్రస్తుతం లూప్ పనులు తుది దశకు చేరుకున్నాయని, వచ్చే నెలలో అందుబాటులోకి తీసుకురావాలన్న నిర్ధేశిత లక్ష్యంతో పనులను వేగవంతం చేసినట్లు అధికారులు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన 47 ప్రాజెక్టుల్లో 36 ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చాయి. ఇదే సమయంలో ఉప్పల్, గచ్చిబౌలి, బయోడైవర్సిటీ, ఆర్టీసీ క్రాస్ రోడ్ జంక్షన్ల మీదుగా చేపట్టిన సెకండ్ లెవల్ ఫ్లై ఓవర్లు ప్రత్యేకతలు ఉండగా.. తాజాగా బైరామల్‌గూడ సెకండ్ లెవల్ ఫ్లై ఓవర్‌తో పాటు రెండు లూప్‌లు సైతం ప్రత్యేక నిర్మాణాలుగా నిలువనున్నాయి. ఔటర్ రింగు రోడ్డు తరహాలో బైరామల్‌గూడలో లూప్‌లు రావడం ఎస్ఆర్‌డీపీలో తొలి నిర్మాణంగా చెప్పుకోవచ్చు. ఎల్బీనగర్, చంపాపేట, సాగర్ రింగు రోడ్డు మార్గాల వైపు వెళ్లేందుకుగాను ఈ లూప్‌లు ఎంతగానో దోహదపడనున్నాయి.

### అద్భుత నిర్మాణాలకు కేరాఫ్ బైరామల్‌గూడ


రూ.134.25 కోట్లతో బైరామల్‌గూడ సెకండ్ లెవల్ ఫ్లై ఓవర్, బైరామల్‌గూడ ఎల్‌హెచ్‌ఎస్ లూప్ రూ.21.63 కోట్లు, బైరామల్‌గూడ ఆర్‌హెచ్‌ఎస్ లూప్ రూ.22.30కోట్లతో నిర్మాణం జరుగుతున్నది. లూప్‌లు, సెకండ్ లెవల్ ఫ్లై ఓవర్‌లు వచ్చే నెల రెండో వారంలో అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు పేర్కొన్నారు. బైరామల్‌గూడలో రెండు ఫ్లై ఓవర్లు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. ఎల్బీనగర్ నుంచి కర్మన్‌ఘాట్ వైపునకు వెళ్లే వాహనాలకు , అటు నుంచి ఎల్బీనగర్ చౌరస్తాకు చేరుకునే వారికి బైరామల్‌గూడ చౌరస్తాలో ఫ్లై ఓవర్లు (ఆర్‌హెచ్‌ఎస్/ఎల్‌హెచ్‌ఎస్) పూర్తి చేసుకుని అందుబాటులోకి వచ్చింది. ఈ క్రమంలోనే చాంద్రాయణగుట్ట ఒవైసీ ఆసుపత్రి, కర్మన్‌ఘాట్ వైపు నుంచి బైరామల్‌గూడ చౌరస్తాలో ఆగకుండా చింతలకుంట చెక్‌పోస్టు, గుర్రంగూడ వైపు సాగర్ రోడ్డుకు చేరుకునేలా ఫ్లై ఓవర్ నిర్మాణం జరుగుతున్నది. ఇది సెకండ్ లెవల్ ఫ్లై ఓవర్. ఇప్పుడున్న ఫ్లై ఓవర్ పైనుంచి సాగిపోతుంది. కర్మన్‌ఘాట్ రోడ్డు నుంచి మూడు లేన్లతో మొదలై చౌరస్తా వద్ద ఆంగ్ల అక్షరం 'వై' అకారంలో రెండు వైపులా విడిపోతుంది. చింతలకుంట చెక్‌పోస్టు రోడ్డు పైకి, మరరొకటి సాగర్ రోడ్డుపైకి వాహనాలు వెళ్లనున్నాయి. ఎల్బీనగర్ నుంచి చంపాపేటకు, సాగర్ రింగు రోడ్డు నుంచి ఎల్బీనగర్‌కు వెళ్లాలంటే చౌరస్తా వద్ద ఆగక తప్పడం లేదు. దీనికి పరిష్కారంగా రెండు లూప్‌లను నిర్మిస్తున్నారు.

### లూప్‌లతో ప్రయోజనాలు

- సాగర్ రింగు రోడ్డు నుంచి ఎల్బీనగర్ వెళ్లే వాహనాలు చౌరస్తా వద్ద ఆగి, గ్రీన్ లైట్ వెలిగాక కుడివైపునకు వెళ్లాలి. ఇక మీదట ఆగకుండా వెళ్లేలా సాగర్ రింగు రోడ్డు నుంచి వచ్చే వాహనాలను చంపాపేట రోడ్డు వైపునకు తీసుకెళ్లి ఎడమవైపునకు మళ్లించి, అప్(ఎగువ) ర్యాంపు ద్వారా కర్మన్ ఘాట్ - ఎల్బీనగర్ ఫ్లై ఓవర్‌కు సదరు వాహనాలను చేర్చనున్నారు.
- ఎల్బీనగర్ నుంచి చంపాపేట వెళ్లే వాహనాలు చౌరస్తా వద్ద నిల్చొని కుడి వైపునకు మళ్లాల్సి ఉండేది. అలాంటిదేమి లేకుండా ఎల్బీనగర్-కర్మన్ ఘాట్ ఫ్లై ఓవర్ పైకి వాహనాన్ని తీసుకువెళ్లి, చౌరస్తా అవతల ఉండే డౌన్ (దిగువ) ర్యాంపు మీదుగా సాగర్ రోడ్డు నుంచి చంపాపేట వైపు వెళ్లే రోడ్డుకు అనుసంధానం చేయనున్నారు.

## విచారణకు రండి

హైదరాబాద్ , రంగారెడ్డి జిల్లా కలెక్టర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం




హైదరాబాద్, డిసెంబర్ 12 (మస్తే తెలంగాణ): హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని ప్రధాన చెరువుల ఆక్రమణలపై తదుపరి విచారణకు హాజరై వివరణ ఇవ్వాలని ఆ రెండు జిల్లాల కలెక్టర్లు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. చెరువు నీటి నిల్వ పూర్తి సామర్థ్యం, సరిహద్దులు నిర్ణయించి రాళ్లు ఏర్పాటు చేయాలని పదేళ్ల కిందట ఆదేశాలు ఇచ్చింది. ఆ ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఉమ్మడిగా సర్వే చేసి స్థాయి నివేదిక అందజేయాలన్న ఉత్తర్వులు ఇప్పటివరకు అమలు చేయలేదని తప్పుబట్టింది. తదుపరి విచారణలోగా నివేదిక అందజేయాలని, విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. జీహెచ్ఎంసీ పరిధిలోని దుర్గంచెరువు, సున్నం చెరువు, ఫిర్జాదిగూడ పెద్ద చెరువు, చిన్న ధామర చెరువు, చిన్న రాయుని చెరువు, నల్ల చెరువు.. ఇలా పలు చెరువులను ఆక్రమించి ఆక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని మాదాపూర్‌కు చెందిన అనిల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అక్రమణలు జరగకుండా చర్యలు చేపట్టేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది.

## ఈ నెల 15న ఉద్యోగ మేళా..

సిటీబ్యూరో, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించడంపై జిల్లా ఉపాధి కల్పన శాఖ దృష్టిసారించింది. అందులో భాగంగా ఈ నెల 15న ఉదయం 10గంటల నుంచి మల్లేపల్లిలోని జిల్లా ఉపాధి కార్మిక శాఖ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీతో పాటు పాలిటెక్నిక్ కోర్సులలో ఉత్తీర్ణులైన యువతకు జాబ్‌మేళాలో పాల్గొనడానికి అవకాశం ఉందన్నారు. అపోలో, జీడాస్ ప్రైవేటు లిమిటెడ్, అవాస కన్సల్టెన్సీ, డాన్ బాస్కో నెట్‌వర్క్ వంటి నాలుగు కంపెనీలలో కలిపి మొత్తం 200 ఉద్యోగాల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి శాఖ అధికారిని మైత్రిప్రియ తెలిపారు.

# వందేండ్ల హెచ్‌పీఎస్

- శతాబ్ది వేడుకలకు ముస్తాబవుతున్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్
- 22 నుంచి 27 వరకు ముగింపు ఉత్సవాల నిర్వహణ
- ప్రపంచ నలుమూలల నుంచి హాజరుకానున్న పూర్వ విద్యార్థులు, ప్రముఖులు
- వచ్చే మూడేండ్లలో పాఠశాల కోసం రూ.100 కోట్లు సమీకరణ
- అంతర్జాతీయ ప్రమాణాల నిర్వహణలో భేష్
- ముగింపు వేడుకలకు రానున్న రాష్ట్రపతి
- హెచ్‌పీఎస్ వైస్ ప్రిన్సిపాల్ అమృత చంద్ర



సిటీబ్యూరో, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): దేశంలోని పురాతన విద్యాసంస్థల్లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఒకటి. విద్యారంగంలో ప్రతిష్ఠాత్మకంగా సేవలందిస్తున్న బేగంపేటలోని హెచ్‌పీఎస్ 2023నాటికి వందేండ్లకు చేరుకున్నది. ఇందులో భాగంగా ఈ ఏడాది పొడువునా శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తూ వస్తున్నది. ముంగింపు వేడుకలకు పాఠశాల ఆవరణంలో చకచకా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈనెల 22 నుంచి 27 వరకు నిర్వహించే ముగింపు ఉత్సవాలకు అన్ని దేశాల నుంచి పూర్వ విద్యార్థులు, ప్రముఖులు హాజరుకానున్నారు. ఈనెల 19న ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా భారత రాష్ట్రపతి హాజరవుతున్నట్లు హెచ్‌పీఎస్ వైస్ ప్రిన్సిపాల్ అమృత చంద్ర తెలిపారు.

### వచ్చే మూడేండ్లలో రూ.100కోట్ల నిధి సమీకరణ

వచ్చే మూడేండ్లలో పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.100కోట్లు సమీకరించనున్నట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఇందుకు పూర్వవిద్యార్థుల సహకారంతో పాటు వారి చేయూతను స్వీకరించనున్నట్లు పేర్కొన్నది. కొవిడ్-19 మహమ్మారి విజృంభించిన పరిస్థితుల్లో పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న స్కూల్ విద్యార్థుల ఫీజుల కోసం కీలకంగా వ్యవరించారని వివరించింది. పూర్వ విద్యార్థుల ద్వారా సేకరించిన నిధులతో ఇన్నోవేషన్ సెంటర్, మల్టీస్పోర్ట్స్ కాంప్లెక్స్, ఐజీసీఎస్ఈకి నూతన భవన సముదాయం, నూతన తరగతి గదుల సముదాయం, ప్రాథమిక, మాధ్యమిక అత్యాధునిక ల్యాబొరేటరీ ఆధునీకరణకు చర్యలు తీసుకోనున్నట్లు యాజమాన్యం వెల్లడించింది.

### ఒలింపిక్స్‌పై దృష్టి..

ఒలింపిక్స్‌తో పాటు ఇతర అంతర్జాతీయ ఈవెంట్లలో ఇంటర్నేషనల్ మెడల్స్ సాధించేలా విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంపై హెచ్‌పీఎస్ దృష్టి సారిస్తున్నదని వైస్ ప్రిన్సిపాల్ తెలిపారు. రాబోయే ఐదేండ్లలో 12 నుంచి 15 కోట్ల మేరకు నిధులను అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి కోసం కేటాయించినట్లు పేర్కొన్నారు.

### అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు

సమగ్రమైన విద్యను అందించాలనే తపనతో హెచ్‌పీఎస్ యాజమాన్యం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు పాటిస్తున్నది. ఇంటర్నేషనల్ స్కూళ్లతో పోలిస్తే.. విద్యార్థులు అతి తక్కువ ఫీజుతోనే చదువుకునే అవకాశం ఉన్నట్లు తెలిపింది. అంతర్జాతీయంగా విజ్ఞానం, సంపూర్ణ విద్యను సులభంగా అభ్యసించే విధంగా పాఠ్య ప్రణాళికను రూపొందించడంలో హెచ్‌పీఎస్‌కు సాటిలేరని చెబుతున్నారు. ఒలింపిక్ చాంపియన్‌షిప్, సినిమా, పాలిటిక్స్, థియేటర్ ఆర్ట్స్, కళలు, వ్యవస్థాపన లాంటి రంగాల్లో హెచ్‌పీఎస్ విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిస్తున్నారు.

### దేశంలోనే అతిపెద్ద సైన్స్, సంగీత ఫెస్టివల్స్..

వందేండ్ల వేడుకల్లో భాగంగా తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సహకారంతో దేశంలోనే అతిపెద్ద ఎడ్యుకేషనల్ సైన్స్ ఫెస్టివల్‌ను నిర్వహించింది. దర్పన్ అకాడమి ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌కు చెందిన డాక్టర్ మల్లికాసారాబాయ్ బృందం 'ది డ్యాన్స్ ఆఫ్ లైఫ్' పేరుతో అద్భుతమైన భరతనాట్యం డ్యాన్స్ థియేటర్ ప్రదర్శన వేడుకలను ఉర్రూతలూగించింది. మల్లికాసారాబాయ్ కూడా ప్రదర్శనలో పాల్గొనడం విశేషం. భవిష్యత్తులో స్టార్టప్‌లను తీర్చిదిద్దేందుకు 4వేల నుంచి 5వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇన్నోవేషన్ సెంటర్‌ను విద్యార్థుల కోసం అందుబాటులోకి తేనున్నది. ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో దేశంలోని సింఫనీ ఆర్కెస్ట్రా నాణ్యత కలిగిన పాశ్చార్య శాస్త్రీయ సంగీతాన్ని ప్రదర్శించింది. హిందుస్థానీ శాస్త్రీయ సంగీతంతోపాటు స్వచ్ఛమైన శాస్త్రీయ పాశ్చాత్య రూపంలో దృష్టి కేంద్రీకరించడానికి హెచ్‌పీఎస్ టాటా కల్చరల్ సెంటర్‌తో కలిసి పనిచేస్తున్నది.